మీ గళం.. మా కలం...!

# నమస్తే హైదరాబాద్

www.namasthehyderabad.in

తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ విశేష ప్రజాధరణ పొందుతున్న నమస్తే హైదరాబాద్ తెలుగు దినపత్రికకు తెలంగాణ రాష్ట్రం లోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో విలేకరులు కావలెను

సీనియర్‌లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం

Ph: 9912580066

రంగా రెడ్డి సంపుటి : 13 సంచిక :210 ఎడిటర్: గొడిశాల సోమయ్య శనివారం 28-12-2024 పేజీలు :4 వెల : 2రూ

## విద్యాశాఖ కీలక నిర్ణయం.



నమస్తే హైదరాబాద్ : కొంతమంది టీచర్ల నిర్వాకంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో కేటాయించిన టీచర్లు వారి ప్లేస్‌లో వాలంటీర్లను నియమించి ఎక్కువ కాలం స్కూల్ మోహం చూడటం లేదు. ఇది ప్రభుత్వ దృష్టికి రావడంతో ఉన్నతాధికారులు ఈ మేరకు అసలు టీచర్లు ఎవరనేది విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు గ్రామస్థులకు తెలిసేలా పాఠశాలల్లో టీచర్ల ఫోటోలు, వివరాలను ప్రదర్శించాలని ఆదేశాలను జారీ చేసింది. రాష్ట్రంలో దాదాపు లక్షకు పైగా ఉపాధ్యాయులు సర్కారు బడుల్లో పని చేస్తున్నారు. కొన్ని స్కూల్స్ లో టీచర్లు దూరం కావడం లేదా ఇతర పనులు చూసుకునేందుకు స్థానికంగా ఉండే వారిని వారి ప్లేస్‌లో నియమించి అసలు టీచర్లు డుమ్మా కొడుతున్నారు. అంటే సాఫ్ట్ వేర్ లో ప్రాక్సీ లాగా నకిలీ టీచర్లు పని చేస్తున్నారు. వీరికి అసలు టీచర్లు దాదాపు పది వేల రూపాయల వరకు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. లాంగ్ లీవ్ పెట్టలేక ఇలా నకిలీలతో మ్యానేజ్ చేస్తూ మొత్తం జీతం కొట్టేస్తున్నారు కొంతమంది టీచర్లు.. ఎప్పుడో ఒకసారి వచ్చేవాళ్లను గుర్తించక అసలు ఉపాధ్యాయులు ఎవరో స్టూడెంట్స్‌కు తెలియకుండా పోతుంది. రాష్ట్రంలోని రిమోట్ ఏరియాలు అంటే మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. దీంతో తాజా సర్క్యూలర్‌తో ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చని స్కూల్ ఎడ్యూకేషన్ విభాగం భావిస్తోంది.

ఇటీవల టీచర్ల బదిలీలు, ప్రమోషన్లు జరగడం, కొత్తగా నియామకాలు చేపట్టడంతో జిల్లా అధికారులకు ఆయా గ్రామాల్లో ఎవరు పని చేస్తున్నారో కాస్త కన్ఫ్యూజన్ నెలకొంది. పర్యవేక్షణకు వెళ్లిన అసలు ఎవరు, నకిలీ ఎవరు అనేది పట్టుకునే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ఫోటో, వివరాలు ప్రదర్శనతో అందరికీ ఒక క్లారిటీ వస్తుందని భావిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు. కేజీబీవీలలో ఈ ఫోటోల ప్రదర్శన జరుగుతోంది. స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు ఇతర టీచర్ల ఫోటోలు సేకరించి నోటీస్ బోర్డులో ప్రదర్శించేలా చర్యలు తీసుకుంటున్నారు. కొంతమంది టీచర్ల పాస్ పోటోలు సైతం అంటిస్తున్నారు. మొత్తంగా తమ వ్యక్తిగత పనులు లేదా ఇతర పనుల్లో బిజీ ఉండే టీచర్లకు బాధ్యతను గుర్తు చేసే అవసరం రావడం శోచనీయం. వారి ప్లేస్‌లో వచ్చే నకిలీ టీచర్లకు ఇలా అయినా చెక్ పడుతుందేమో వేచి చూడాలి.

## ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం డీపీఆర్ కన్సల్టెన్సీ సంస్థ ఎంపిక నేడు



నమస్తే హైదరాబాద్ : రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం రహదారికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను ప్రభుత్వానికి అందించే బాధ్యత ఏ సంస్థకు దక్కనుందనే విషయం శనివారం తేలనుంది. డీపీఆర్ తయారీకి కన్సల్టెన్సీ సంస్థ ఎంపిక కోసం ప్రభుత్వం నవంబరు 25న 'ఇంటర్నేషనల్ కాంపిటీటివ్ బిడ్డింగ్' విధానంలో టెండర్లను ఆహ్వానించింది. టెండర్ల దాఖలకు నిర్దేశించిన గడువు శుక్రవారం మధ్యాహ్నం 3గంటలతో ముగిసింది. నిబంధనల ప్రకారం శుక్రవారమే సంస్థ ఎంపిక తేలాల్సి ఉన్నప్పటికీ.. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతితో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటించింది.ఆ కారణంగా దాఖలైన టెండర్లను అధికారులు శనివారం ఉదయం తెరవనున్నారు. వీటిలో మొదటగా టెక్నికల్ బిడ్‌లను తెరుస్తారు. వాటిలో ఏమైనా సాంకేతిక సమస్యలు ఉన్నాయా అని పరిశీలిస్తారు. ఆ తరువాత టెండర్ పత్రాలను 'టెక్నికల్ ఎవాల్యుయేషన్ కమిటీ'కి పంపుతారు. నిబంధనల ప్రకారమే టెండర్లు దాఖలు చేశారా? లేదా అని కమిటీ పరిశీలిస్తుంది. అనంతరం సక్రమంగా ఉన్న టెండర్లను ఖరారు చేసి, ఆ టెండర్ల ఫైనాన్స్ బిడ్‌లను తెరుస్తారు. ఫైనాన్స్ బిడ్‌లను తెరిచిన తరువాత వాటిలో డీపీఆర్ తయారీ కోసం ఏ సంస్థ తక్కువ ధరను వేసిందో పరిశీలించి, ఆ సంస్థ టెండర్‌ను ఖరారు చేయనున్నారు.

## రేవంత్ రెడ్డి సర్కార్‌కు ఎమ్మెల్సీ కవిత వార్నింగ్.


నమస్తే హైదరాబాద్ : తెలంగాణలో రాజకీయ పరిస్థితులు ఎప్పటికప్పుడు మారిపోతున్నాయి. రేవంత్ రెడ్డి సర్కారుకు ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు మధ్య మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలోనే.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. కీలక డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలుపై.. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉండాలని కవిత సూచించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో స్పష్టత ఇచ్చాకే ఎన్నికలకు వెళ్లాలని కవిత డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని వార్తలు వస్తున్నాయన్న కవిత.. బీసీల రిజర్వేషన్ల పెంపుపై స్పష్టత ఇవ్వకుండా ఎన్నికలు జరిపేందుకు వీలు లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో హామీ ఇచ్చినట్టుగా కవిత గుర్తు చేశారు. బీసీల జనాభా ఎంతో తెలియకపోతే హామీ ఎలా ఇచ్చారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జనాభాలో సగానికిపైగా బీసీలే ఉన్నారని.. కానీ 42 శాతం అని కాంగ్రెస్ ఎలా చెబుతుందో ఇప్పటికీ అంతుపట్టడం లేదని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లు పెంచని పక్షంలో ఎన్నికలు జరగనివ్వబోమన్నారు. మండల కేంద్రాలు, జిల్లాల్లో, రాష్ట్రవ్యాప్తంగా.. బీఆర్ఎస్, తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు చేపడుతామని కవిత హెచ్చరించారు.

42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కవిత వార్నింగ్ ఇచ్చారు. బీసీ డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఇచ్చిన తరువాత.. బీసీ జనాభాను వెల్లడించాకే ఎన్నికలపై



ప్రభుత్వం ఆలోచన చేయాలని సూచించారు. మరోవైపు.. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా జనవరి 3వ తేదీన ఇందిరా పార్క్ వద్ద భారీ సభను నిర్వహించనున్నట్టు ఎమ్మెల్సీ కవిత ప్రకటించారు.ఇక.. తెలంగాణలో సర్పంచ్ ఎన్నికలు ఎప్పుడెప్పుడా అని రాష్ట్ర ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన తర్వాత బీసీ రిజర్వేషన్లపై ఓ క్లారిటీ వస్తుందని.. ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్నట్టు ప్రభుత్వం పెద్దలు గతంలో చెప్పిన విషయం తెలిసిందే. అయితే.. ఇప్పుడు మరి ప్రభుత్వం ఎలాంటి అడుగు వేస్తుందన్నది క్లారిటీ రావాల్సి ఉంది.

## తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ వెన్నుతట్టిన మన్మోహన్: కేటీఆర్



నమస్తే హైదరాబాద్ : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌లో న్యాయం ఉందని, ఆ ఆశయం ఫలించాలని మనస్ఫూర్తిగా ఆశించిన వ్యక్తి మన్మోహన్ సింగ్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్‌కు మన్మోహన్‌తో ఎంతో సాన్నిహిత్యం ఉందని.. తెలంగాణ ఉద్యమ సమయంలో అధైర్య పడొద్దని, వెన్నుతట్టి ధైర్యం చెప్పారని గుర్తు చేశారు. శుక్రవారం రాత్రి ఢిల్లీలో మాజీ ప్రధాని మన్మోహన్ పార్థివదేహానికి బీఆర్ఎస్ ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, కేఆర్ సురేశ్ రెడ్డి, దామోదర్‌రావులతో కలిసి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. దేశాన్ని మన్మోహన్ ఆర్థికంగా ఎంతో ముందుకు తీసుకెళ్లారని, ప్రపంచంలో దేశ ఖ్యాతిని పెంచారని తెలిపారు. దాదాపు రెండేళ్లపాటు ఆయన కేంద్ర మంత్రివర్గంలో కేసీఆర్ పనిచేశారని గుర్తు చేశారు. 2004లో కేంద్ర మంత్రివర్గంలో చేరిన తర్వాత తెలంగాణ ఉద్యమంలో ఎన్నోసార్లు ఆటుపోట్లు ఎదురైతే అధైర్య పడొద్దని ప్రోత్సహించారని చెప్పారు.

## బిగుస్తున్న ఉచ్చు!



నమస్తే హైదరాబాద్ : ఫార్ములా ఈ కారు రేసు వ్యవహారంలో కేటీఆర్ చుట్టూ ఉచ్చు బిగుసుకుంటోంది. తమకు అందిన ఫిర్యాదు ఆధారంగా కేటీఆర్‌ను ఏ1గా, అర్వింద కుమార్ ఏ2గా, బీఎల్ఎన్ రెడ్డి ఏ3గా కేసు నమోదు చేసిన ఏసీబీ, ఫిర్యాదులోని ప్రతి అంశానికి పక్కా ఆధారాలు సేకరించింది. తాము సేకరించిన ఆధారాలు, మంత్రి హోదాలో కేటీఆర్ చేసిన తప్పులు, సచివాలయ బిజినెస్ రూల్స్ ఉల్లంఘన, ఆర్థిక శాఖను బేఖాతర్ చేసిన 2లో

## మన్మోహన్ జీవితం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయక పాఠం

నమస్తే హైదరాబాద్ : దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ జీవితం భవిష్యత్ తరాలకు ఒక స్ఫూర్తిదాయక పాఠంగా ఉంటుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దేశ విభజన తర్వాత సర్వస్వమూ పాకిస్థాన్‌లో వదిలేసి భారత్‌కు వచ్చిన కుటుంబానికి చెందిన మన్మోహన్.. తీవ్రమైన సమస్యల మధ్య కూడా అనేక అసాధారణ విజయాలు సాధించారని గుర్తు చేశారు. ఈ మేరకు మోదీ శుక్రవారం ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. 'దేశ ప్రజానీకం పట్ల, దేశాభివృద్ధి పట్ల మన్మోహన్ అంకితభావం ఎల్లప్పుడూ గౌరవాన్ని అందుకుంటుంది. ఆయన మృతి దేశానికి తీరని నష్టం కలిగించింది. హుందాతనం మూర్తీభవించిన వ్యక్తిగా, మేధావిగా, ఆర్థికవేత్తగా, సంస్కరణలకు అంకితమైన నాయకుడిగా మన్మోహన్ ఎప్పటికీ గుర్తుండిపోతారు' అని మోదీ తెలిపారు.



సవాళ్లతో కూడుకున్న సమయంలో మన్మోహన్ ఆర్బీఐ గవర్నర్‌గా పని చేశారని, పీవీ నరసింహారావు హయాంలో కేంద్ర ఆర్థికమంత్రిగా దేశాన్ని నూతన ఆర్థిక పథంలో నిలిపారని, ప్రధానిగా దేశాభివృద్ధికి కట్టుబడి సేవలందించారని వివరించారు. వ్యక్తిగతంగా మన్మోహన్ పాటించిన విలువలనూ మోదీ ప్రశంసించారు. 'ప్రపంచ ప్రఖ్యాత 2లో

## మన్మోహన్ ఓ చాంపియన్

నమస్తే హైదరాబాద్ : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణంపై జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. ప్రపంచంలోని గొప్ప చాంపియన్లలో మన్మోహన్‌సింగ్ ఒకరని, భారత్-అమెరికాల మధ్య పౌర అణు సహకార ఒప్పందంలో కీలకపాత్ర పోషించారని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటొనీ బ్లింకెన్ చెప్పారు. రెండు దేశాల మధ్య స్నేహం బలోపేతమయ్యేందుకు విశేషంగా కృషి చేశారని తెలిపారు. 2లో

# బిగుస్తున్న ఉచ్చు!

వైనాన్ని పూసగుచ్చినట్లు కౌంటర్ అఫిడవిట్ ద్వారా ఏసీబీ హైకోర్టు ముందుంచింది. ఫార్ములా ఈ రేసుకు సంబంధించి అంతా తన కనుసన్నల్లోనే జరిగిందని, పూర్తి బాధ్యత తనదేనని టీవీల్లో కేటీఆర్ చెప్పిన అంశాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఏ విధంగా నేరస్థుడు అవుతారో వివరాలను ఏసీబీ అధికారులు హైకోర్టు ముందు పెట్టారు. ఫార్ములా ఈ రేసు కేసులో ఒకటి రెండు కాదని, అనేక ఉల్లంఘనలు జరిగాయని ఏసీబీ పేర్కొంది. ఒప్పందం చేసుకోవడానికి ముందే నిధులను విదేశీ కరెన్సీ రూపంలో చెల్లించారని ప్రస్తావించింది. 2022లో తొలిసారి చేసుకున్న ఒప్పందంలోనూ గవర్నర్ అనుమతి తీసుకోలేదని, 2023లో చేసుకున్న ఒప్పందంలో ఒక అడుగు ముందుకు వేసి విదేశీ కరెన్సీ రూపంలో నిధుల చెల్లింపు చేయడం పూర్తిగా నేరపూరిత చర్యేనని ఏసీబీ స్పష్టం చేసింది. మొత్తం రూ. 54.9 కోట్లను కేటీఆర్ నిర్దేశం ప్రకారమే ఖర్చు చేశారని ధ్రువీకరించింది. ఇందులో ప్రాథమికంగా ఆధారాలున్నాయి కాబట్టి కేసు నమోదు చేసినట్లు ఏసీబీ న్యాయస్థానానికి నివేదించింది. సచివాలయ బిజినెస్ రూల్స్ 9,11 ప్రకారం నిర్ణీత మొత్తం కన్నా ఎక్కువగా ఏ శాఖ అయినా ఖర్చు చేయాల్సి ఉంటే ఆర్థిక శాఖ అనుమతి తీసుకోవాలని గుర్తు చేసింది. మంత్రివర్గం అనుమతి తర్వాతే ఆర్థిక శాఖ నిధులను విడుదల చేయాలని స్పష్టం చేసింది. తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కోడ్‌లోని ఆర్టికల్ 51(బి), ఆర్టికల్ 299 ప్రకారం విదేశీ కంపెనీతో ఒప్పందం చేసుకోవాలి అంటే గవర్నర్ అనుమతి తీసుకోవాల్సిందేనని ఏసీబీ చెప్పింది. వీటిని ఉల్లంఘించి ఆర్థిక ఒప్పందం చేసుకోవడమంటే విచారించ తగ్గ నేరమేనని వ్యాఖ్యానించింది. కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకోకుండా డబ్బు విడుదల చేయడం నేరమేనని ఏసీబీ అధికారులు వివరించారు. ప్రభుత్వ ఆస్తిపై ఆధిపత్యం కలిగి ఉన్న ప్రజాప్రతినిధిగా నేరపూరిత విశ్వాస ఉల్లంఘనకు పాల్పడితే సెక్షన్ 409 వర్తిస్తుందని తెలిపింది. ఈ సెక్షన్ కింద నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేసేందుకు ఏసీబీకి అధికారం ఉంది. ఇదే విషయాన్ని పలువురు న్యాయ నిపుణులు ధ్రువీకరిస్తున్నారు. డిసెంబరు 31లోగా కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేస్తే సెక్షన్ 409 కింద ఏసీబీ నోటీసులు ఇవ్వకుండానే కేటీఆర్‌ను అరెస్టు చేసే అవకాశం ఉందంటున్నారు. మంత్రివర్గం ఆమోదం లేకుండా, రిజర్వు బ్యాంకు అనుమతి తీసుకోకుండా వ్యవహరించడం సెక్షన్ 13(1)(ఏ) కింద నేరమని ఏసీబీ తన కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొంది. ఈ విధంగా తాము నమోదు చేసిన ప్రతి సెక్షన్‌కు సంబంధించి కేటీఆర్ తదితరులు ఏ విధంగా కేసు విచారణకు అర్హులో వివరిస్తూ సుదీర్ఘ కౌంటర్‌ను ఏసీబీ హైకోర్టు ముందు ఉంచింది.

## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి ఘనంగా నివాళులు

దేవరుప్పుల (నమస్తే హైదరాబాద్) మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం తీవ్ర విచారకరం. దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరాములు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ఆయన దేశ ఆర్థిక క్షేత్రాన్ని పూర్తిగా మార్చేశారు. అభివృద్ధి అంతులేని సంపదల పదంలో దేశాన్ని నడిపించారు. మన్మోహన్ మరణంతో దేశం మేరు సమనుడైన మేధావిని. ఒక దర్శనీక నేతను కోల్పోయింది. ఆర్థిక రంగంపై ఆయనకున్న లోతైన అవగాహన. వీనమ్రతతో కూడుకున్న ఆయన నడవడి దేశ భివృద్ధి పట్ల ఆయనకున్న నిబద్ధత ఎన్నటికీ మరువలేనివి అని నల్ల శ్రీరామ్ తెలిపారు.



ఈ కార్యక్రమంలో. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు,

## మృతి చెందిన కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



దేవరుప్పుల (నమస్తే హైదరాబాద్) దేవరుప్పుల మండలం మాదాపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చిలుకాని శీను వారి కుమారుడు ఇటీవల మరణించగా. శుక్రవారం విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చిలుకని శీను ఇంటి దగ్గరికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి. వారి కుటుంబానికి బి ఆర్ ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో. బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు, గ్రామ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

## మన్మోహన్ జీవితం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయక పాఠం

విద్యాసంస్థల్లో చదువుకొని, ఉన్నత హోదాల్లో పని చేసిన మన్మోహన్‌సింగ్.. తన మూలాలను, వాటి తాలూకు విలువలను ఎన్నడూ మర్చిపోలేదు. నిజాయితీ, నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనంగా జీవితం గడిపారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా నిలిచారు. కొన్నేళ్లుగా ఆరోగ్యం సహకరించకపోయినా వీల్‌చెయిర్‌లో వచ్చి పార్లమెంటు కార్యకలాపాలకు హాజరయ్యారు' అని గుర్తు చేశారు. మన్మోహన్‌సింగ్‌ది రాజకీయపార్టీలకు అతీతమైన వ్యక్తిత్వమని, తాను గుజరాత్ సీఎంగా ఉన్న రోజుల్లో అనేక జాతీయ, అం తర్జాతీయ అంశాలపై ప్రధానిగా ఉన్న మన్మోహన్‌ను కలిసి మాట్లాడేవాడినని మోదీ పేర్కొన్నారు. 2014లో తాను ప్రధాని అయిన తర్వాతా మన్మోహన్‌ను ఆయన పుట్టినరోజున కలిసి మాట్లాడానని తెలిపారు.బెంగళూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహాత్మాగాంధీ బెళగావిలో బాధ్యతలు చేపట్టి వందేళ్లు గడిచిన సందర్భం గా నిర్వహిస్తున్న సభ.. రెండో రోజు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సంస్మరణ సభగా మారింది. 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' సభను రద్దు చేసి, అక్కడే మన్మోహన్ సింగ్ సంస్మరణ సభ నిర్వహిం చారు. కేపీసీసీ ఆధ్వర్యంలో శుక్రవారం మన్మోహన్‌సింగ్ సంస్మరణ సభ నిర్వహించారు. సీఎం సిద్దరామ య్య, మంత్రులు పుష్పాంజలి ఘటించారు.

## గుర్నాథం చెరువు సుందరీకరణ పనులను పరిశీలించిన పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే అరికపూడి గాంధీ

నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని చెరువులను సుందరీకరిస్తున్నామని పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే అరికపూడి గాంధీ అన్నారు. శుక్రవారం మియాపూర్ డివిజన్ పరిధిలోని గుర్నాథం,కైదమ్మ కుంట చెరువుల సుందరీకరణ పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ,స్థానికులతో కలిసి పీఏసీ చైర్మన్ అరికపూడి గాంధీ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కైదమ్మ కుంట చెరువు పునరుద్ధరణ ప్రభుత్వం, పరిశ్రమలు సమాజం మధ్య భాగస్వామ్య ప్రయత్నాలు అర్థవంతమైన పర్యావరణ పురోగతిని ఎలా నడిపించగలదో చెప్పడానికి ఒక శక్తివంతమైన ఉదాహరణగా నిలుస్తుంది. ఈ ప్రాజెక్ట్ కీలకమైన సహజ వనరులను పునరుజ్జీవింపజేయడమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా భవిష్యత్తులో సుస్థిరమైన అభివృద్ధి కోసం ఒక నమూనాను ఏర్పాటు చేస్తుంది" అని అన్నారు. ఎన్నో ఏండ్ల సమస్యలు తీరుతాయని సీఎస్ఆర్



ఫండ్స్ వల్ల స్వచ్ఛమైన మంచినీటి చెరువుగా మారనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలింగ్ గౌతమ్ గౌడ్, ఐటీ సంస్థ ప్రతినిధులు రామ్ బొట్ట, చైతన్య, నాయకులు సుదేశ్,నాగరాజు ,గోపాల్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## మన్మోహన్ ఓ చాంపియన్

మన్మోహన్ చేపట్టిన ఆర్థిక సంస్కరణలతో ఎప్పటికీ గుర్తుండిపోతారని బ్లింకెన్ కీర్తించారు. రష్యా–భారత్ మధ్య ప్రత్యేక వ్యూహాత్మక బం?ధం ఏర్పడటంలో మన్మోహన్ పాత్ర కీలకమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చెప్పారు. ఆర్థిక రంగంలో భారత్ ప్రగతి కోసం ఆయన విశేషంగా కృషి చేశారని ప్రశంసించారు. భారత్–చైనా మధ్య సంబంధాలు సజావుగా కొనసాగేలా మన్మోహన్ యత్నించారని చైనా విదేశాంగ ప్రతినిధి మావో నింగ్ తెలిపారు. మన్మోహన్ హయాంలో సరిహద్దు అంశంపై కీలక ఒప్పందాలు కుదిరాయన్నారు. దేశ ప్రయోజనాల కోసం ధైర్యంగా ఆర్థిక సంస్కరణలు చేపట్టారని భారత్‌లో బ్రిటన్ హైకమిషనర్ లిండీ కామెరాన్ కీర్తించారు. ఆర్థిక రంగంలో భారత్‌ను సరైన స్థానంలో ఉంచడంలో కీలకంగా వ్యవహరించారని అభిప్రాయపడ్డారు. అఫ్ఘానిస్థాన్ ప్రజలకు మన్మోహన్ మంచి మిత్రుడని ఆదేశ మాజీ అధ్యక్షుడు హమిద్ కర్జాయ్ తెలిపారు. మన్మోహన్‌తో పనిచేయడం గొప్పగా ఉండేదని మాల్దీవుల మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్ చెప్పారు. బ్రిక్స్, ఐబీఎసఏ గ్రూపుల ఏర్పాటులో మన్మోహన్ కీలకంగా వ్యవహరించారని బ్రెజిల్ అధ్యక్షుడు లులా డిసెల్వా చెప్పారు. మంచి స్నేహితుడిని కోల్పోయానన్నారు. మన్మోహన్ గొప్ప దార్శనికుడని, అసామాన్య రాజనీతిజ్ఞుడని నేపాల్ మాజీ ప్రధాని పుష్ప కమల్ దహల్ చెప్పారు. అనేకతరాలపాటు ఆయన స్ఫూర్తి కొనసాగుతుందన్నారు. మన్మోహన్ దార్శనిక ఆర్థికవేత్త అని శ్రీలంక మాజీ అధ్యక్షుడు మహింద రాజపక్స చెప్పారు.

## మన్మోహన్ సింగ్ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరిచిన వ్యక్తి : జగదీశ్వర్ గౌడ్



నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి : భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించిన భారత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ కన్ను మూయడం దేశానికి తీరని లోటని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. మన్మోహన్ సింగ్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ నియోజకవర్గ పరిధిలోని నల్లగండ్ల గ్రామంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో కలిసి జగదీశ్వర్ గౌడ్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ భారత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ దేశం ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరిచిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టి.కృష్ణ, మిరియాల రాఘవరావు, కృష్ణ ముదిరాజ్, మన్నెపల్లి సాంబశివరావు, ప్రభాకర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, గఫర్, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ గౌడ్, సంగారెడ్డి, రవి కుమార్, కార్తీక్ గౌడ్, వెంకట్ రెడ్డి, పోచమ్మ, శివ గౌడ్, యాదగిరి, లక్ష్మణ్, బాలరాజ్ ముదిరాజ్, భారత్, జావీద్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ముషారఫ్, శివానంద రెడ్డి, సుస్మిత, యూత్ నాయకులు దుర్గేష్, సాయి కిషోర్, కృష్ణ, యాదయ్య, సుధాకర్, నజీర్, వెంకటేష్ ముదిరాజ్, అశోక్ రెడ్డి, రాజు, జయ సాయి, సతీష్, మహిళలు పార్వతి, జయ, మౌనిక, నాగమ్మ, కల్పన, స్వాతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మన్మోహన్ సింగ్ తన పాలనలో తెలుగు రాష్ట్రాలపై చెరగని సంతకం..

మన్మోహన్ సింగ్‌కు తెలుగు రాష్ట్రాలతో విడదీయలేని అనుబంధం ఉంది. ప్రధానిగా పేదలకు ఉపయోగపడే పథకాలను తీసుకొచ్చారు మన్మోహన్ సింగ్. పేదలు పస్తులు ఉండొద్దన్న ఉద్దేశంతో పనికి ఆహార పథకాన్ని ప్రవేశపెట్టారు. ఆ పథకాన్ని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రారంభించారు. అనంతపురంలో ఉపాధి హామీ పథకాన్ని లాంచ్ చేశారు మన్మోహన్ సింగ్. ఈ పథకం యూపీఏ ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చి పెట్టింది. అలాగే పేదల కడుపు నింపింది.

మన్మోహన్ సింగ్ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కాంగ్రెస్ ఏపీ నేతలు తీవ్రంగా వ్యతిరేకించారని.. కేంద్ర కేబినెట్‌లో ఉన్న ఏపీ నేతలు రాజీనామా చేస్తామన్నా మన్మోహన్ సింగ్ వెనక్కి తగ్గలేదన్నారు హస్తంపార్టీ నేతలు. పార్లమెంట్‌లో రచ్చజరిగినా ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు మన్మోహన్ సింగ్. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు పాస్ చేయించేందుకు మన్మోహన్ సింగ్ కీలక భూమిక పోషించారన్నారు అప్పటి కేంద్రహోంమంత్రి షిండే .

కాంగ్రెస్ అధికారం కోల్పోయాక విభజన సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేశారు మన్మోహన్ సింగ్. విభజన హామీలన్నీ కేంద్రం నెరవేర్చాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనన్నారు మన్మోహన్ సింగ్. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే తప్పకుండా ప్రత్యేక హోదా ఇచ్చేవాళ్లమన్నారు.

# మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు

## బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు నర్మెట వెంకటరమణ గౌడ్

కాజీపేట, డిసెంబర్ 27 (నమస్తే హైదరాబాద్) భారత మాజీ ప్రధానమంత్రి, దేశ ఆర్థిక సంస్కరణ రూపకర్త డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరనిలోటని బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు నర్మెట వెంకటరమణ గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో గ్రామ కాంగ్రెస్ శ్రేణులందరూ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణంతో దేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందని అన్నారు. వారు ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడే దేశంలో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని, ఒక ఆర్థిక వేత్తగా, ఒక అధ్యాపకుడిగా, రిజర్వు బ్యాంకు గవర్నర్ గా, రాజ్యసభ సభ్యుడిగా, ప్రతిపక్ష నాయకుడిగా, ప్రధానమంత్రిగా దేశానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. యూపీఏ ప్రభుత్వానికి నాయకత్వం వహించి పదేళ్లపాటు ప్రధానమంత్రిగా వారు దేశంలో అనేక వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని అన్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం పూడ్చలేనిదని వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు కట్కూరి రమేష్, సీనియర్ నాయకులు గంగుల శ్రీ నివాస్ రెడ్డి, నాగపూరి రాజయ్యగౌడ్ , బస్కె శ్రీలేఖ కృష్ణ, శీలం రమేష్ కుమార్,నర్మెట వేణుగోపాల్, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి కట్కూరి రేవంత్, యూత్ కాంగ్రెస్ నాయకులు బస్కె ప్రణయ్, ఆకారపు శివాజీ, బాస్కె రావి, నూటెంకి సతీష్, దామెర్లప్పుల కోటేశ్వర్,లదేళ్ల కుమార్,బత్తిని విజ్జగిరి, రుద్రోజు సంపత్, బుర్ర మధు,తదితరులు పాల్గొన్నారు.



# ఏం టాలెంట్ భయ్యా..



ఆవాలతో దివంగత నేత భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఆర్ట్ వేసి ఆయనపై ఉన్న ప్రేమను చూపించాడు ఓ కళకారుడు.. ఆయన మరణం బాధాకరమని అయనకు ఘన నివాళులు అర్పించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన సేవారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు.. తెలంగాణ ఇచ్చిన నేత మరణం ఎంతో బాధాకరం అని, ఒక గొప్ప వ్యక్తిని ఈ దేశం కోల్పోయిందని, తనదైన ప్రతభ, జ్ఞానంతో భారత దేశానికి ప్రధానిగా అపూర్వ సేవలందించిన మహానీయుడని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఎన్నో దశబ్దాల ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ నెరవేర్చింది మన్మోహనే అని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఇలా ఆవాలతో మన్మోహన్ చిత్రాన్ని చిత్రించి ప్రార్థిస్తున్ననట్లు చెప్పారు.

# నేడు అధికార లాంఛనలతో మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు..





అనారోగ్యంతో కన్నుమూసిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు..ఢిల్లీలో నేడు కేంద్ర ప్రభుత్వం అధికారిక లాంఛనలతో జరగనున్నాయి. ఈ మేరకు ఢిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ ఉదయం 11 గంటల 45 నిమిషాలకు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అంతిమ సంస్కారాలు జరుగుతాయని కేంద్ర హోంశాఖ తెలిపింది. సైనిక లాంఛనాలతో తుది వీడ్కోలు పలికేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కేంద్ర రక్షణ శాఖను కోరినట్లు చెప్పింది. అయితే కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేస్తోంది కాంగ్రెస్ పార్టీ. మన్మోహన్‌సింగ్ అంత్యక్రియల కోసం వీర్‌భూమి లేదా శక్తి స్థల్‌లో కొంత భాగం కేటాయించాలని కేంద్రాన్ని కోరింది కాంగ్రెస్ పార్టీ. అక్కడే మన్మోహన్ సమాధి నిర్మించాలని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం మార్చుకోకపోవడంపై కాంగ్రెస్ అసహనం వ్యక్తం చేస్తోంది. మన్మోహన్‌ను ప్రభుత్వం అవమానిస్తోందని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు.రాజ్ ఘాట్ దగ్గర స్థలం కేటాయించాలంటూ ప్రధానికి లేఖ మన్మోహన్ సింగ్ అంత్యక్రియలకు యమునా నది తీరంలోని రాజ్ ఘాట్ దగ్గర స్థలం కేటాయించాలంటూ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు..కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే. అలాగే ఫోన్ కూడా చేసినట్లు చెప్పారు. ఈ మేరకు సోషల్‌మీడియా ఎక్స్‌లో పోస్టు పెట్టిన ఖర్గే..గతంలో పలువురు మాజీ ప్రధానులు, రాజనీతిజ్ఞుల అంత్యక్రియలు రాజ్ ఘాట్ లోనే జరిగాయని, అక్కడే సంప్రదాయం ప్రకారం మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు, స్మారకం ఏర్పాటు కోసం అక్కడే స్థలం ఇవ్వాలని కోరారు. దేశ ప్రజల హృదయాల్లో మన్మోహన్ సింగ్ అత్యంత గౌరవనీయమైన స్థానాన్ని కలిగి ఉన్నారని, ఆయన సేవలు, సాధించిన విజయాలు అపూర్వమైనవన్న ఖర్గే..ఆయన సముచితంగా గౌరవించుకోవాలన్నారు.

పీవీ అంత్యక్రియల వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గతంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు అధికారంలో ఉండి కూడా ఢిల్లీలో అంత్యక్రియలు జరగనివ్వకుండా హైదరాబాద్‌కు ఆయన భౌతిక కాయం పంపారన్న విమర్శలు ఎదుర్కొంది కాంగ్రెస్ పార్టీ. దీంతో మన్మోహన్ సింగ్ విషయంలో అలాంటి తప్పిదం జరగకూడదని భావిస్తోంది. వాస్తవానికి 2013లో కేంద్రంలో అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం..ఢిల్లీలో ప్రత్యేకంగా మరే నాయకుడికి ప్రత్యేకంగా స్మారకాలను ఏర్పాటు చేయకూడదని నిర్ణయం తీసుకుంది. రాజధానిలో స్థలాభావం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అప్పటి యూపీఏ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో మాజీప్రధాని మన్మోహన్‌సింగ్‌కు స్మారకం ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని కోరడం చర్చనీయాంశంగా మారింది.

# ఆర్థిక మంత్రిగా మన్మోహన్ సింగ్‌ను పివి నరసింహారావు ఎందుకు ఎంచుకున్నారు..?

ఇది దాదాపు 1991 జూన్ నెల. యూనివర్సిటీ గ్రాంట్ కమీషన్ ఆఫీసులో ఫోన్ మోగింది. ఫోన్ చేసిన వ్యక్తి తన పేరు నరసింహారావు అని చెప్పారు. యూనివర్శిటీ గ్రాంట్ కమిషన్ కార్యాలయంలో ఒక్కసారిగా ఉక్కిరిబిక్కిరి అయ్యారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ తో మాట్లాడాలని అప్పటి ప్రధానమంత్రి పివి నరసింహారావు స్వయంగా కాల్ చేశారు. కొద్ది నిమిషాల్లో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఫోన్ దగ్గరకి వచ్చారు. నరసింహారావు వెంటనే నిన్ను నా ఫైనాన్స్ మంత్రిగా చేయాలనుకుంటున్నాను.. నువ్వు సిద్ధపడి రాష్ట్రపతి భవన్‌కు రండి అని చెప్పారు.పివి నరసింహారావు ఇచ్చిన ఈ పిలుపుతో డాక్టర్ మన్మోహన్ సింగ్ రాజకీయ జీవితం ప్రారంభమైంది. ఎలాంటి రాజకీయ అనుభవం లేని ఆయన ఏకంగా ఆర్థిక మంత్రి అయ్యారు. అంతకుముందు, మన్మోహన్ సింగ్ 1972లో ఆర్థిక మంత్రికి ముఖ్య ఆర్థిక సలహాదారుగా, 1976లో ఆర్థిక మంత్రిత్వ శాఖలో కార్యదర్శిగా, ఆ తర్వాత 1980 నుంచి 1982 వరకు ప్రణాళికా సంఘం సభ్యుడిగా, 1982 నుంచి 1985 వరకు రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా ఉన్నారు. 1985 నుండి 1987 వరకు ప్రణాళికా సంఘం చైర్మన్. ఉపాధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వహించారు. చంద్రశేఖర్ ప్రభుత్వంలో మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రికి ఆర్థిక సలహాదారుగా కూడా ఉన్నారు.

1991 లోక్‌సభ ఎన్నికల సమయంలో రాజీవ్ గాంధీ హత్యకు గురయ్యారు. ఎన్నికల ఫలితాలు రాగానే కాంగ్రెస్ 244 స్థానాల్లో విజయం సాధించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని, అయితే సోనియా గాంధీ రాజకీయాల్లోకి రాకూడదని నిర్ణయించుకున్నారు. ఇక, కాంగ్రెస్ పార్టీలో ప్రధాని కోసం అన్వేషణ మొదలైంది. ముందుగా శంకర్ దయాళ్ శర్మ పేరు వచ్చింది. సోనియా గాంధీ దూతలు శంకర్ దయాళ్ శర్మను ఒప్పించేందుకు ప్రయత్నించగా, ఆయన అంగీకరించలేదు.ఈలోగా రాజకీయాల్లో దూసుకుపోతున్న తెలంగాణకు చెందిన అపర రాజకీయ చాణక్యుడు పివి నరసింహారావు భవితవ్యం తేలిపోయింది. శంకర్ దయాళ్ శర్మ నిరాకరించడంతో పివి నరసింహారావు పేరును సోనియా గాంధీకి సూచించారు. ఆ తర్వాత నరసింహారావు పేరుపై ఏకాభిప్రాయం కుదిరింది. ప్రధానమంత్రి కాకముందు నరసింహారావు అనేక శాఖల మంత్రిగా పనిచేశారు. అతనికి చాలా అనుభవం ఉంది. కానీ అతను ఆర్థిక మంత్రిత్వ శాఖ గురించి చాలా ఆందోళన చెందారు. 1991లో భారతదేశ ఆర్థిక పరిస్థితి చాలా దారుణంగా ఉంది. చిన్నాభిన్నమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు అనుభవజ్ఞులైన వ్యక్తి కోసం పివి అన్వేషించారు.అటువంటి పరిస్థితిలో, దేశ ఆర్థిక వ్యవస్థను తిరిగి దారిలోకి తీసుకురాగల వ్యక్తికి ఆర్థిక మంత్రిత్వ శాఖను అప్పగించాలని నరసింహారావు కోరుకున్నారు. నరసింహారావు సలహాదారు పీసీ అలెగ్జాండర్ ఐజీ పటేల్ పేరును సూచించారు. %×+% పటేల్ రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా కూడా ఉన్నారు. నరసింహారావు ప్రతిపాదనను ఐజీ పటేల్ అంగీకరించలేదు. ఎందుకంటే తన తల్లి అనారోగ్యం కారణంగా అతను ఢిల్లీకి రావడానికి ఇష్టపడలేదు. అప్పుడు అలెగ్జాండర్ మన్మోహన్ సింగ్ పేరును సూచించారు. మన్మోహన్ సింగ్‌ను పిలిచిన పిసి అలెగ్జాండర్ ఆర్థిక మంత్రిగా ప్రతిపాదించారు. మన్మోహన్ సింగ్ దానిని జోక్ అని కొట్టిపారేశారు. మరుసటి రోజు పివి నరసింహారావు స్వయంగా మన్మోహన్‌సింగ్‌కు ఫోన్ చేసి రాష్ట్రపతి భవన్‌కు రమ్మని చెప్పారు. ఈ విధంగా మన్మోహన్ సింగ్ రాజకీయ జీవితం ప్రారంభమైంది. అతను దేశ ఆర్థిక మంత్రి అయ్యారు. ఆర్థిక సరళీకరణ ద్వారా వెంటిలేటర్‌కు చేరుకున్న ఆర్థిక వ్యవస్థకు మన్మోహన్ సింగ్ చికిత్స అందించారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచ మార్కెట్‌తో అనుసంధానించారు. మన్మోహన్ సింగ్ విషయంలో పివి నరసింహారావు తీసుకున్న నిర్ణయం భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి పోసింది. కేవలం రెండేళ్లలోనే మన్మోహన్ సింగ్ తన ఆర్థిక విధానాలు, సరళీకరణతో విమర్శకుల నోరు మూయించారు. ఆ తర్వాత మన్మోహన్ సింగ్ వెనుదిరిగి చూడలేదు. ఐదేళ్లు ఆర్థిక మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రతిపక్షంలోకి వచ్చాక రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా చేశారు. అతను 1998 నుండి 2004 వరకు ఈ పదవిలో ఉన్నారు. ఆ తర్వాత 2004లో దేశ ప్రధానిగా పదేళ్ల పాటు దేశ పగ్గాలు చేపట్టారు.

# ఆర్థికవేత్తగా భారత భవిష్యత్తును మార్చిన మన్మోహన్ సింగ్.



భారత విశిష్ట నేతల్లో మన్మోహన్ సింగ్ ఒకరు.. మన్మోహన్ సింగ్ భారత ఆర్థిక విధానాలపై బలమైన, చెరగని ముద్ర వేశారు.. ఈ మాటలన్నది ప్రతిపక్ష యూపీఏ కూటమి నేతో లేదా కాంగ్రెస్ నేతో కాదు. భారతీయ జనతా పార్టీ నేత, భారత ప్రధాని నరేంద్రమోదీ. అదీ మన్మోహన్ సింగ్ లెవెల్. ఆర్థిక వేత్తగా, ప్రధానిగా మన్మోహన్‌సింగ్ దేశానికి చేసిన సేవలు అలాంటివి మరి. దివాలా తీసిన భారత ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారు మన్మోహన్ సింగ్. ఆర్థిక వ్యవస్థను సరళీకరించి భారతదేశం ప్రపంచంలోనే ఆర్థిక సూపర్ పవర్‌గా మారడానికి మార్గం సుగమం చేశారు.1991లో ప్రధాని పీవీ నరసింహారావు ఆర్థికవేత్త అయిన మన్మోహన్‌సింగ్‌ను ఏరికోరి కేంద్ర ఆర్థికమంత్రిగా బాధ్యతలు అప్పగించారు. ఆ నమ్మకాన్ని మన్మోహన్ సింగ్ నిలబెట్టుకున్నారు. ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారు మన్మోహన్ సింగ్. ఆర్థిక వ్యవస్థను సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ దిశలో తీసుకెళ్లడంలో ముఖ్య పాత్ర పోషించారు. దిగుమతి-ఎగుమతి విధానాన్ని సంస్కరించారు. విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించారు. మన్మోహన్ సింగ్-పీవీ నరసింహరావు తీసుకున్న నిర్ణయాల వల్లే భారత దేశం క్లిష్ట పరిస్థితుల నుంచి గట్టెక్కింది. 2004 నుంచి 2014 వరకు భారత ప్రధానిగా సేవలందించిన మన్మోహన్ సింగ్ దేశంలో ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చారు. పైకి మృదుస్వభావిలా కనిపించినా దేశం కోసం తీసుకునే నిర్ణయాల్లో అత్యంత కఠినంగా వ్యవహరించారు మన్మోహన్ సింగ్. 2008లో చారిత్రాత్మకమైన భారతదేశం-అమెరికా పౌర అణు ఒప్పందంపై సంతకం చేశారు మన్మోహన్ సింగ్. భారతదేశం ప్రపంచ అణు మార్కెట్లోకి ప్రవేశించడానికి, ఇంధన సంక్షోభాన్ని అధిగమించడానికి ఈ ఒప్పందం దోహదపడింది. యూపీఏ ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతు ఇచ్చిన లెఫ్ట్ పార్టీలు ఈ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి. మద్దతు ఉపసంహరించుకున్నాయి. అయినా మన్మోహన్ సింగ్ వెనక్కి తగ్గలేదు.దేశంలో పేదవాళ్ల ఆకలి తీర్చేందుకు 2005లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చారు మన్మోహన్ సింగ్. పాలనలో పారదర్శకతను తీసుకొచ్చేలా.. అధికారులు గుట్టుగా ఉంచే సమాచారాన్ని సామాన్యులు సైతం పొందేందుకు సమాచార హక్కు చట్టాన్ని తీసుకొచ్చింది కూడా మన్మోహన్ సింగే. ప్రతి భారతీయ పౌరుడికి ప్రత్యేక గుర్తింపు సంఖ్యను అందించాలనే లక్ష్యంతో మన్మోహన్ సింగ్ హయాంలో ఆధార్ పథకం ప్రారంభించారు. ఇప్పుడు అన్నింటికీ ఆధారం ఆధార్ కార్డే అయింది. జాతీయ ఆహార భద్రతా చట్టం-2013ని తీసుకొచ్చారు.2009లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఉచిత, నిర్బంధ విద్య కోసం బాలల హక్కు చట్టాన్ని అమలు చేసింది. సింగ్ హయాంలో భారతదేశం అధిక ఆర్థిక వృద్ధి రేటును నమోదు చేసింది. భారతదేశ %+ఞా% వృద్ధి రేటు 2004-2008 మధ్య 8 శాతం కంటే ఎక్కువగా నమోదైంది. రోడ్లు, విద్యుత్, నీటి సౌకర్యాలకు ప్రాధాన్యతనిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మన్మోహన్ సింగ్ భారత్ నిర్మాణ్ యోజనను ప్రారంభించారు. జననీ సురక్ష యోజన జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ వంటి పథకాలను తీసుకొచ్చారు. పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారు మన్మోహన్ సింగ్.

# సినిమా



## నటి రోజా కూతురిని చూశారా?



ప్రముఖ నటి రోజా ఇప్పుడు రాజకీయాల్లో బిజీగా ఉంటున్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్థాపించిన వైసీపీలో కీలక నేతగా వ్యవహరిస్తున్నారు. వరుసగా రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆమె జగన్ హయాంలో మంత్రిగా పనిచేశారు. అయితే 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె ఓటమిపాలయ్యారు. అయినా అధికార పార్టీపై విమర్శలు చేస్తూ వార్తల్లో నిలుస్తున్నారామె. ఇదిలా ఉంటే రోజా బాటలోనే ఆమె కూతురు అన్షు మాలిక కూడా పయనిస్తున్నట్లు తెలుస్తోంది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఆమె తన అందంతో ఇప్పటికే మంచి క్రేజ్ ను సొంతం చేసుకుంది. త్వరలోనే సినిమా ఇండస్ట్రీలోకి కూడా అడుగు పెట్టనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఓ ప్రముఖ బ్యానర్‌తో అన్షు సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టనుందని రూమర్లు వినిపిస్తున్నాయి. అయితే అన్షు మాలిక సినీ రంగ ప్రవేశంపై ఆమె కుటుంబ సభ్యుల నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ విషయం పక్కన పెడితే సినిమాల్లోకి రాకుండానే అవార్డుల మీద అవార్డులు గెల్చుకుంటోంది అన్షు. వెబ్ డెవలపర్‌గా, కంటెంట్ క్రియేటర్‌గా మంచి పేరు సంపాదిస్తోంది రోజా కూతురు. అంతేకాదు రైటర్‌గా కూడా సత్తా చాటుతోంది. తన మల్టీ ట్యాలెంటెతో ఎన్నో పురస్కారాలు, ప్రశంసలు అందుకుంటోంది. అలా తాజాగా అన్షు ఓ అరుదైన అవార్డును సొంతం చేసుకుంది.నైజీరియాలోని లాగోస్‌లో జరిగిన గ్లోబల్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ ఫెస్టివల్‌లో "సోషల్ ఇంపాక్ట్" విభాగంలో గ్లోబల్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ అవార్డు అందుకుంది అన్షు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ఆమెనే షేర్ చేసింది. అవార్డుతో కలిసి దిగిన ఫొటోలు, వీడియోలను అందులో షేర్ చేసింది. ప్రస్తుతం ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారాయి. వీటిని చూసిన వారందరూ 'వావ్' అంటూ రోజా కూతురిపై ప్రశంసలు కురిపిస్తున్నారు. కాగా అన్షు గతలో 'ది ఫ్లేమ్ ఇన్ మై హార్ట్' అనే నవల కూడా రాసింది. దీనికి గానూ ' బెస్ట్ ఆథర్ ఇన్ సౌత్ ఇండియా' అవార్డును కూడా అందుకుందీ స్టార్ కిడ్.

# వ్యాయామం చేస్తే గుండెపోటు రాదా?



కొత్త ట్రెండ్‌గా మారిన ఈ తరుణంలో యువకులు గతంలో కంటే ఎక్కువగా జిమ్‌కి వెళ్తున్నారు. బలమైన, బరువైన శరీరాన్ని నిర్మించుకునే ప్రయత్నంలో, జిమ్‌కు వెళ్లేవారు తరచుగా వారి శరీర అవసరాలు, సామర్థ్యాలకు సరిపోని కఠినమైన వ్యాయామాలు చేస్తారు. భారతదేశంలోని యువకులు %-% పురుషులు లేదా మహిళలు %-% మునుపెన్నడూ లేనంతగా నేడు గుండె జబ్బులతో బాధపడుతున్నారు.

పాశ్చాత్య దేశాలతో పోలిస్తే, భారతీయులు వారి కంటే కనీసం 10 సంవత్సరాల ముందుగానే గుండె జబ్బులతో బాధపడుతున్నారు. భారతదేశం గుండె ఆరోగ్యం వెనుక ఒక కారణం ఏమిటంటే, పాశ్చాత్య జనాభాతో పోలిస్తే మన రక్త నాళాలు చాలా చిన్నవిగా ఉన్నాయి. యువత, ఫిట్‌నెస్ ఫ్రీక్స్‌లో పెరుగుతున్న గుండెపోటు కేసులు పెరుగుతున్నాయి. వ్యాయామం చేసే వారికి గుండెజబ్బులు ఉండవని చెప్పడం పూర్తిగా తప్పు. వ్యాయామం వల్ల గుండెపోటు రాకపోయి ఉంటే గత ఏడాది చాలా మంది నటులు చనిపోయి ఉండేవారు కాదు. గత సంవత్సరం, నటుడు సిద్ధార్థ్ శుక్లా, హాస్యనటుడు రాజు శ్రీవాస్తవ , నటుడు దీపేష్ భాన్ కూడా వ్యాయామం చేస్తున్నప్పుడు గుండెపోటుతో మరణించారు. అందుకే జిమ్ ఇప్పుడు ప్రాణాంతకంగా మారిందా? వ్యాయామశాలలో కఠినమైన శిక్షణ ఉందా? వ్యాయామశాలలో ఇచ్చే సప్లిమెంట్లు ప్రాణాంతకంగా ఉన్నాయా? జిమ్‌లో వ్యాయామం చేస్తున్నప్పుడు గుండెపోటు ఎందుకు వస్తుంది? నిజానికి గుండెపోటుతో మరణిస్తున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతూనే ఉంది. ఇదిలా ఉంటే జిమ్‌లో వర్కౌట్స్ సమయంలో కూడా ఇలాంటి ఉదంతాలు ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. జిమ్‌లో పని చేయడం నేరుగా గుండెపై ఎలా ప్రభావం చూపుతుంది?అకస్మాత్తుగా గుండెపోటు రావడానికి ప్రధాన కారణం చాలా ఎక్కువ వ్యాయామం చేయడం లేదా రొటీన్‌కు కట్టుబడి ఉండకుండా హఠాత్తుగా ఎక్కువ వ్యాయామం చేయడం అని డాక్టర్ అంకుర్ చెప్పారు. ప్రజలు కొన్ని నెలల వ్యవధిలో పదేపదే తమ ఆరోగ్యాన్ని చెక్ చేసుకోవడం మంచిదంటున్నారు. సప్లిమెంట్స్ ప్రజల ఆరోగ్యంపై కూడా చెడు ప్రభావం చూపుతాయి. చాలా మంది సప్లిమెంట్లను చెక్ చేసుకోకుండానే ఎక్కువ మోతాదులో తీసుకుంటారు. 90 శాతం మంది అసిడిటీ వల్ల ఛాతీలో నొప్పి వస్తోందని, కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉండవచ్చని, అందుకే ఆరోగ్యం చాలా ముఖ్యం అని డాక్టర్ చెప్పారు.

జిమ్‌కు వెళ్లే ముందు ఈ విషయాలు గుర్తుంచుకోండి:

డాక్టర్ అంకుర్ మాట్లాడుతూ.. జిమ్‌కు వెళ్లే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డైట్ చార్ట్ పాటించాలని అన్నారు. ఆహారం వారి ఆరోగ్యానికి ప్రధాన కారణం. సలహాదారుగా ఉన్న సంజయ్ చవాన్ జిమ్‌కి వెళ్లే వారికి డైట్‌ని సూచిస్తారు. శరీరాన్ని జిమ్‌లో నిర్మించుకోలేదని, డైట్ ద్వారా బాడీ బిల్ట్ అవుతుందని చెప్పారు. ఆహారాన్ని ప్రతి రెండు గంటలకు తక్కువ మొత్తంలో తినాలి.. ఒకేసారి ఎక్కువ పరిమాణంలో తినకూడదని చెబుతున్నారు. ఆహారం నుండి తక్కువ ప్రోటీన్ పొందే వ్యక్తులు మన అవసరానికి అనుగుణంగా సప్లిమెంట్లను తీసుకోవడం చాలా ముఖ్యం అని డాక్టర్ చెప్పారు. వారు ఈ ప్రోటీన్‌ను సప్లిమెంట్ల నుండి పొందవచ్చు. కానీ ప్రతిదీ పరిమితుల్లోనే చేయాలి. అది పరిమితికి మించి ఉంటే అది హానికరమని సంజయ్ సూచిస్తున్నారు.

అందరూ జిమ్‌లో శిక్షణ ఇవ్వలేరు:

జిమ్‌లో గుండెపోటు కారణంగా మరణాలపై జిమ్ యజమాని, ట్రైనర్ విక్రాంత్ దేశాయ్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వర్కౌట్‌లు చేయాలి. కానీ ఈ రోజుల్లో జరుగుతున్నది తప్పు. దేశం మొత్తం మీద జిమ్‌ల సంఖ్య పెరిగిందని విక్రాంత్ అన్నారు. అందరూ జిమ్‌ని వ్యాపారంగా భావించి పెట్టుబడులు పెడుతున్నారు. అయితే ఈ విషయంలో వారు సర్టిఫైడ్ ట్రైనర్‌లను నియమించుకోరు. ప్రతి ఒక్కరూ జిమ్‌లో శిక్షణ ఇవ్వలేరు. సర్టిఫికేట్ కలిగి ఉండటం అవసరం. జిమ్‌లకు వెళ్లే ముందు సర్టిఫికేట్ ఉండటం, అలాగే మంచి అనుభవం ఉన్న ట్రైనర్ ఉండటం ముఖ్యమని గుర్తించుకోవాలన్నారు.

# మరోసారి షాకిచ్చిన బంగారం ధర.



ఇటీవల కాలంలో బంగారం ధరల్లో భారీగా హెచ్చుతగ్గులు కనిపించాయి. ఇక గత కొన్ని రోజులుగా భారీగా తగ్గిన బంగారం ధర.. గత రెండు రోజులుగా పెరుగుతూ షాక్ ఇస్తోంది. నిన్న అంటే, శుక్రవారం 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 71,260 ఉండగా.. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 77,740గా ఉంది. ఇక నేడు శనివారం 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 71,510లకు చేరుకోగా.. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 78,010గా నమోదైంది. ఇక వెండి ధర విషయానికొస్తే.. వాటి ధరలు సైతం పెరిగాయి. శుక్రవారం కిలో వెండి ధర రూ. 91,700గా ఉంది.ఇక హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములు రూ.71,510 కాగా.. 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములు రూ.78,010గా ఉంది. విశాఖపట్నం, విజయవాడలోనూ ఇదే ధర కొనసాగుతోంది. అటు దేశ రాజధాని న్యూఢిల్లీలో మాత్రం 22 క్యారెట్ల పసిడి ధర రూ.71660 ఉండగా.. 24 క్యారెట్ల బంగారం ధర రూ. 78,160గా ఉంది.

వెండి ధరలు విషయానికొస్తే.. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడలో కిలో వెండి రూ. 99,900 ఉండగా.. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరులో కేజీ వెండి ధర రూ. 92,400గా నమోదైంది. ఇక మీరు తాజాగా నమోదైన బంగారం ధరలను తెలుసుకునేందుకు, 8955664433కు మిస్డ్ కాల్ ఇవ్వవచ్చు.

# దీప్తి, రేణుకల సూపర్ స్పెల్..



భారత్, వెస్టిండీస్ మహిళల క్రికెట్ జట్టు మధ్య వన్డే సిరీస్‌లో మూడో మ్యాచ్ వడోదరలో జరిగింది. ఈ మ్యాచ్‌లో భారత జట్టు అద్భుత విజయాన్ని నమోదు చేసింది. వెస్టిండీస్‌ను 5 వికెట్ల తేడాతో ఓడించి సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. తొలుత బౌలింగ్ చేసిన టీమిండియా హేలీ మాథ్యూస్ సారథ్యంలోని జట్టును కేవలం 162 పరుగులకే కట్టడి చేసింది. ఆ తర్వాత బ్యాటర్లు తమ సత్తా చూపి ఈ సులభమైన లక్ష్యాన్ని కేవలం 28.2 ఓవర్లలోనే ఛేదించారు. ఈ మ్యాచ్‌లో దీప్తి శర్మ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపికైంది. మూడో వన్డేలో టాస్ గెలిచిన వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. కానీ ఆమె నిర్ణయం తప్పని తెలిసేందుకు ఎంతో సమయం పట్టలేదు. భారత బౌలర్ల ధాటికి ఏ బ్యాటర్ కూడా నిలువలేకపోయారు. భారత్ తరఫున రేణుకా సింగ్ ఠాకూర్, దీప్తి శర్మ కలిసి ప్రత్యర్థి జట్టును కకావికలు చేశారు. ఇన్నింగ్స్ తొలి బంతికే వెస్టిండీస్‌కు షాక్ ఇచ్చింది రేణుక. చివరి బంతికి మరో వికెట్ తీసింది. ఆ తర్వాత 9 పరుగుల వద్ద మూడో వికెట్ కూడా పతన మైంది. దీంతో కరీబియన్ జట్టు ఇక కోలుకోలేకపోయింది. ఆ తర్వాత దీప్తి శర్మ మిగిలిన పనిని పూర్తి చేసింది. రేణుక 9.5 ఓవర్లలో 29 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టింది. కాగా, దీప్తి 10 ఓవర్లలో 31 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టింది. వీరిద్దరిసంచలన బౌలింగ్‌తో భారత జట్టు వెస్టిండీస్‌ను 162 పరుగులకే పరిమితం చేసింది.అయితే ఛేజింగ్‌లో భారత్ 55 పరుగుల వద్ద 3 వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 32 పరుగులతో, జెమిమా రోడ్రిగ్స్ 29 పరుగులతో విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడారు. దీప్తి 48 బంతుల్లో 39 పరుగులు చేయగా, రిచా ఘోష్ 11 బంతుల్లో 23 పరుగులు చేసింది. దీంతో భారత్ ఈ చిన్న లక్ష్యాన్ని కేవలం 28.2 ఓవర్లలోనే ఛేదించింది. దీప్తి మొదట బంతితో ఆ తరువాత బ్యాట్‌తో నూ మెరిసింది. దీంతో ఆమె ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపికైంది.

Printed published and owned by Godishala Somaiah published from # 15-76,Medipally, Ghatkesar,Ranga reddy,Dist,Printed at Sri SehaSai Printers,IDA BalaNagar, Hyderabad,Editor : Godishala Somaiah,email:nhnews24@gmail.com,ph 9912580066,RNI APTEL/2012/45237..

NH paper 28-12-24 (4).pmd 4 12/28/2024, 7:13 AM